నిర్భాగ్యజీవి

శ్రీమతి మోపర్తి కమలాంబ

ఆది ఒక పల్లెటూరు. అందు ఒక పేద బ్రాహ్మణుని గృహము. బ్రాహ్మణుడు ఎక్కువ దైవభక్తిగలవాడు. ప్రతిదినముదయముననే నిద్రమేల్కొని స్నానపానాదుల నాచరించి కాళికాదేవి దేవళమునకు అర్చనచేయుటకై పోవుచుండెడివాడు. అతని భార్య, శాంతమ్మయు ఎక్కువ వినయ విధేయతలు గలిగినదై, భర్తకనుగుణ్యముగా ప్రవర్తించుచుండెను. కాని వారికి సంతానములేదు. ఎన్నియో నోముల నోచినది శాంతమ్మ, కాని లాభములేకుండెను. శాంతయ్యయు కాళికాదేవి సముఖమునందు ఎన్నియో వ్రతములుచేసెను, కాని లాభము కనుపించకుండెను. శాంతమ్మకు సంతాన వాత్సల్యము తగ్గలేదు. పసిబిడ్డ పెరటియందు పచ్చపచ్చగా ఎప్పుడు తిరుగునాయని యువ్విళ్లూరుచుండెను. ఒక దినమునందు శాంతమ్మభర్త పొరుగుపల్లెకు పోవుచూ భార్యతో కాళికాదేవికి అర్చన జాగ్రత్తగా జరుపుమని చెప్పెను. ఆ దినము శుక్రవారమగుటచే శాంతమ్మ అభ్యంగన స్నానమాచరించి చిత్ర విచిత్రమైన పూలమాలలు కట్టి పళ్లెమునందుంచి, పండ్లు, ఫలహారములనందుంచి ఘల్లు, ఘల్లుమని అందెలు మ్రోగగా కాళికాదేవిని పూజించుటకు దేవాలయమున కరిగెను. ఇత్తడి బిందను చంకనబెట్టి నిర్మలమైన భాగీరథీ జలమును కొనివచ్చి కాళికకభ్యంగన జలకమాడించెను. తాను తెచ్చిన పసుపు కుంకుమతో అలంకరించి, పూలదండలతో విగ్రహమునలంకరించెను. శాంతమ్మ ఎక్కువ భక్తితో కాళికను కొలుచుచుండెను. కాళికాదేవికి శాంతమ్మ భక్తిని, దయను పరీక్షింప నెంచి ఒక ముదుసలి వేషమును ధరించి దేవళము ముందు రోదనము చేయ మొదలిడెను. అప్పుడు శాంతమ్మ దేవళములోనుండి పరిగిడి వచ్చి ఏమని ముదుసలిని ఓదార్చెను. అప్పుడా ముదుసలి తను ఎంతో ఆకలి బాధతో మలమలమాడి పోవుచుంటిననియు, కాళికాదేవికి తెచ్చినవన్నియు తన ముందే పెట్టుమని రోదనము దొడంగెను. శాంతమ్మయు శాంతస్వభావముగలదై కాళికకర్చనకై తెచ్చిన వన్నియు భక్తితో, దయతో, ప్రేమతో ముసలికి తినిపించెను. అప్పుడా ముసలి మూర్ఛ వచ్చినట్లుగా నటించి నేలపై సాగిలపడి కాళ్లు, చేతులు కొట్టుకొన దొడంగెను. శాంతమ్మయు దగ్గరనున్న కొలనుకు పోయి ఎన్నియో బిందెలజలమును తెచ్చి ముదుసలికి స్మృతి వచ్చువరకునూ పోయుచూనేయుండెను. కాని ఎంతసేపటికిని ముదుసలికి స్మృతి రాలేదు. సున్నితమైన శాంతమ్మ దేహము సూర్యుని వేడికి కందగడ్డ అయ్యెను. ఒడలెల్ల చెమటచే తడిసెను. శాంతమ్మ కొంతయో అలసటవచ్చెను. కాని బిందెలతో జలమును కొనివచ్చి ముదుసలికిచ్చుట మాత్రము మానలేదు. అప్పుడు ముదుసలి రూపముతోనున్న కాళికాదేవి నిజరూపమున ప్రత్యక్షమై శాంతమ్మ భక్తిశ్రద్ధలకు మెచ్చి వరమడుగమనెను. అప్పుడు శాంతమ్మయు చేతులు జోడించినదై కాళికాదేవిని "ఎల్లప్పుడును భక్తితో తనను (కాళికాదేవిని) కొల్చునట్లును, జీవమును బాసిన పిదప తనలో ఐక్యమగునట్లును ప్రసాదింపుమని వేడెను. కాళికాదేవియు అందులకంగీకరించి సంతాన ప్రాప్తి అనతి కాలములోనే కలుగుననియు పల్కి అంతర్ధానమయ్యెను. శాంతమ్మయు జరిగిన సంఘటనను మనస్సున తలంచుకొనుచు ఇంటి ముఖము పట్టెను. సూర్యుడు తనయొక్క కిరణసముదాయముచే పుడమినెల్ల ప్రకాశింప జేయుచుండెను. ఉష్ణతాపమునకు భీతిల్లి పక్షులు తమబిడ్డలతో తమగూళ్ళయందే యుండెను. ప్రజలుకూడా ఉష్ణతాపమునకు వెరచిరి కాబోలు శయ్యామందిరములలో పరుండిరి. చెట్లు ఎండ వేడిమిని భరింపజాలక తలలువంచినవి. తుమ్మెదలగుంపులు తమ కవసరమగు మధువును గ్రోలుటకు పూవు పూవున కెగురుచుండెను. అట్టి తరి పొరుగు పల్లెకుపోయిన శాంతయ్య వచ్చుచుండెను. ఎండ తీక్షణమునకు తాళజాలక ఎటులో కష్టపడి యిల్లు

చేరుకొనెను. అలసి సొలసివచ్చిన భర్తను ఎంతో ఆప్యాయముతో శాంతమ్మ అతని కష్టమును మరపించునట్లుగా చేసెను. తరువాత స్నానముచేసి భోజనముచేసి ప్రయాణబడలిక తీర్చుకొనుటకై శయనించెను. పరుండినదే తడవుగా నిద్రాదేవిఒడిని చేరెను. ఆగాఢ నిద్రలో తనకు కొలదికాలములో సంతాన ప్రాప్తి కలుగగలదన్న వాక్యాలు వినవచ్చెను. నిద్ర మేల్కొని తనకు కలయా, భ్రమయా అని ఏమియు తోచక భార్యను పిలిచి చెప్పెను. అప్పుడు శాంతమ్మయు చిరునగవు మోముతో తనకు దేవి ప్రత్యక్షమైనట్లును, తను చేసిన సేవయు మున్నగు విషయములు పూసగ్రుచ్చినట్లుగా చెప్పెను. శాంతయ్యయు మోమున సంతోషాతిశయమున భార్యను పొగడెను.

ఇట్లు కొంతకాలము గడచినపిదప శాంతమ్మ గర్భవతి అయ్యెను. నవమాసములునిండిన పిదప ఒక దినమునందు శాంతమ్మ ప్రసవ వేదన పడుచుండెను. ఇరుగు పొరుగు వారందరూ త్రుటి కాలములోనే గుమిగూడిరి. శాంతయ్య అదృష్టవంతుడనియు, శాంతమ్మ నోములపంటయనియు, కాళికాదేవి మహత్యమనియు,ఎవరిష్టమొచ్చిన విధముగ వారు మాట్లాడుచుండిరి శుభసమయమునందు శాంతమ్మయు శాంత స్వరూపిణివంటి ఆడశిశువును కనెను. శాంతయ్య సంతోషమునకు మేరలేదు. ఇరుగుపొరుగువారును సంతోషపడిరి.పదునొకటవ దినము నాడు శాంతమ్మను స్నానమాడించిరి, పురోహితులు వచ్చిరి. ఇరుగు పొరుగు వారితోను, బంధుమిత్రులతోను ఇల్లు కళకళలాడుచుండెను. అందరి సమక్షములోనికిని బిడ్డను కొనివచ్చిరి. ఆ బిడ్డకు శాస్త్రయుక్తముగా చంద్రిక యని పేరుపెట్టిరి. చంద్రికయు ఆ రోజునకారోజు శుక్లపక్ష చంద్రుని మాదిరి పెరుగుచుండెను.భార్యాభర్తల సంతోషమునకు మేరలేకుండెను. ఇట్టి సమయమునందు శాంతయ్యను కారు మేఘములు క్రమ్ముకొనెను. అతనిని చీకటి ఆవరించెను. అతని జీవితములోనున్న జ్యోతి ఆరిపోయెను. శాంతమ్మ తన నోములపంటయు, తన ముద్దులబిడ్డయునైన చంద్రికను ప్రాణసమానుడైన భర్తను వీడి పరలోకమందున్న కాళికాదేవిలో లీనమయ్యెను. శాంతయ్యకు వేరు దిక్కులేనివాడై కాళికాదేవిని కొల్చుచు, తన ముద్దుబిడ్డయు, సుగుణాలరాసియునైన చంద్రికను నల్లారుముద్దుగా పెంచుచుండెను. చంద్రికయు ఆ దినమున కాదినము పెరుగుచుండెను. వచ్చిరాని మాటలతో తండ్రిని సంతోషపెట్టుచుండెను. తప్పటడుగులతో తండ్రి పనిలో ప్రవేసించి తండ్రి పనికి అడ్డవచ్చుచుండెడిది. శాంతయ్యయు భార్య పోయిన దిగులం మరచి చంద్రికనే ఎంతో గారాబముగా పెంచుచుండెను చంద్రికకు ఇరుగు పొరుగు పిల్లలతో సఖ్యత కుదిరెను. తోటి స్నేహితుల ప్రోత్సాహముచే శాంతయ్య ఏకపత్నీవ్రతము విడనాడి పునర్వివాహమాచరించెను. చంద్రికను సవతి తల్లివచ్చిన క్రొత్తలో గారాబముగా చూడమొదలిడెను. అందులకు శాంతయ్య సంతోషించెను, శాంతయ్య రెండవభార్య వలన సంతానవంతుడయ్యెను. చంద్రికయు తన తండ్రి వద్ద భగవద్గీత, వేదపఠనము, సంగీతము మొదలగునవి నేర్చుకొనుచుండెను. తల్లి శాంతమ్మ భక్తిపోకడలే బిడ్డకలవడెను. చంద్రిక తండ్రికన్నముందే నిద్ర మేల్కొని నిత్యకృత్యములను తీర్చుకొని ప్రాతఃకాలము కాగానే కాళికాలయమునకరగి కాళికను పూజించుచుండెడిది. మరలివచ్చి యింటి పనులను చూచుకొనుచుండెడిది, ఉదయ సాయంత్రములం చంద్రిక భక్తితో కాళికను కొల్చుచుండెడిది. సవతి తల్లికిది కష్టముగానుండెను. చంద్రికను ఇంటెడు చాకిరి చేయమని వేధింపమొదలిడెను. కాని చంద్రికకున్న చిన్నవయస్సునందామెకు ఆటలపై ధ్యాస యుండునని చెప్పుటలో అతిశయోక్తి ఏమున్నది? కాని సుగుణాలరాశి అయిన చంద్రిక సవతితల్లి చెప్పు పనులన్నియు మెళుకువతో ముగించితన స్నేహితురాండ్ర యొద్దకు ఆటలకై పోవుచుండెడిది. తోటి పిల్లలతో కలసిమెలసి తిరుగుటచే ఇరుగు పొరుగు తల్లుల ప్రేమకు పాత్రురాలయ్యెను. చంద్రికను చూచిన ప్రతివారును శాంతమ్మను జ్ఞప్తికి తెచ్చుకొనెడివారు, శాంతమ్మయుండిన కూతురును చూచి

ఎంత మురిసిపోయెడిదోగదా యని వాపోవుచుండెడి వారు. శాంతయ్యను దారిద్ర్యదేవత ఒడిలోనికి లాగుకొనెను. ఆనాటికానాటికి కష్టములు భరింపజాలకుండెను. లోలోన శాంతయ్య దారిద్ర్యబాధ ననుభవింపలేక క్రుశించుచుండెను. ఆకలి బాధకు మల మలమాడి పోవుచుండిరి. బిడ్డల యొక్క దుస్థితిని చూచి ఎంతయో దుఃఖించుచుండిరి. చంద్రిక పన్నెండుయేళ్లు కలదయ్యెను. మీదు మిక్కిలి శాంతయ్యకు చంద్రిక వివాహమును గురించి పెద్ద సమస్య అయ్యెను. ఏ పని చేయుటకైనను ధనము కావలయునుగదా? శాంతయ్యకు డబ్బు కరువయ్యెను. ఎన్నియో సంబంధములు విచారించివచ్చెను. కాని అన్నియు అందని పండ్లయ్యెను. శాంతయ్య అందని పండ్లకై అఱ్ఱులుచాచరాదని నిశ్చయించుకొనెను. ధనాశ, సవతితల్లి పోరు ఈ రెండునూకూడినవి, మిసమిస లాడుచున్న చంద్రికను కాటికి కాళ్లు చాచిన ముసలిబడుగునకు ధనాశకులోనై బలిచేసిరి. చంద్రికయు వేరు దిక్కులేనిదై తల్లిదండ్రులు చేయు దుండగమును చూచుచుండెను, మనస్సునందు దైవము తనకట్టి దానినిప్రసాదించెను కాబోలునని దిటవుచేసుకొనుచుండెను. కాళికను మాత్రము ఎల్లవేళల పూజించుచుండెను. నిర్ణీత ముహూర్తమున చంద్రికకు ముసలిబడుగుతో వివాహమాయెను. చంద్రిక తోటి పిల్లలతో ఆటపాటలందున్నప్పుడందరూ అమ్మమ్మ యనియు, తాతయ్యకు పండ్లూడి పోయినవనియు గేలిచేయుచుండెడివారు. చంద్రికయు పిల్లలతో ఆడుటకు సిగ్గుపడి ఆటలుమానివేసెను. కాళికను మీదు మిక్కిలి భక్త్యావేశములతో గొలుచుచుండెను! యుక్తవయస్సు రాగానే చంద్రికను తీసికొని పోవుటకై ముసలి బడుగువచ్చెను. శాంతయ్యయు చంద్రికనత్తవారింటికి పంపుటకై ప్రయాణ సన్నాహములుగావించుచుండెను, శాంతయ్య చంద్రికకు చేసిన అన్యాయమునకు లోలోన దుఃఖించుచుండెను.

కానిపైకి మాత్రము తొణకకుండెను. చంద్రికయు మనస్సునందు పొంగి పొరలి వచ్చు దుఃఖమునిను మడింపచేసుకొని కాళికాదేవికి మ్రొక్కి తరలి వచ్చెను. చెల్లెండ్రను, తమ్ములను, స్నేహితులను పిలిచి వారికి మంచి నీతులనుభోదించినది సుగుణశీల చంద్రిక, తల్లి దండ్రులను, ఇరుగుపొరుగు వారికిని తన్ను మరువక అప్పుడప్పుడు తలంచుకొను చుండుడని చెప్పి కన్నీరు కార్చినది, బిడ్డలుగన్న ప్రతి యిల్లాలుకును చంద్రికను చూచిన జాలివేయును. కాని సవతి తల్లిమాత్రము మారు పలుకకుండెను. చంద్రిక తండ్రిని చేరినది. తండ్రి ఆశీర్వాదము పొంది, తన కాళిని మాత్రము మరువక ప్రతిదినము కొలుచుచుండమని చెప్పెను. కంటినీరు పెట్టుకొనుచు అందరికిని తుది నమస్కారముపెట్టి "మరల మిమ్ములను చూడలేను" అని చెప్పుచూ బండిలో పాదముపెట్టెను. ముసలి బడుగు యింటిలో ప్రవేసించినది. ప్రతి దినముదయముననే భర్తకు నమస్కరించి తనయొక్క పనులను నెరవేర్చుకొనుచుండెడిది. ప్రక్కననున్న కాళికాదేవి దేవళమునందు పూజచేయుచుండెడిది. అది ఒక పాడుబడ్డ దేవళము. చుట్టునూ ఒక తోటయుండెను. సాయంత్రము కాగానే పూజకై పూలుకోసుకొని బంగరు పళ్లెమునందుంచుకొని కాళికాదేవి గుడికి పోయినది. తన నిర్భాగ్యజీవితగాధను కాళికకు విన్నవించుకొని, కాళికలో ఐక్యమయి పోయిగా ఆమె ఒడిలో శాశ్వతనిద్రపోయెదానికి దేవి కాళ్ళమీద పడి పోయింది. ముసలి బడుగు యింటికివచ్చి చంద్రికకొరకు వెదకెను. భావులు, చెరువులు, గుంటలు, మిట్ట వెదకించెను. తుదకు పాడుబడ్డ దేవాలయములోని కాళికాదేవి పాదములచెంత శాశ్వత నిద్రపోయిన చంద్రికను చూచి నిర్ఘాంత పోయెను. తల్లి దండ్రులకు వర్తమానముపంపి పిలిపించెను. నిర్భాగ్యజీవి చంద్రిక ఎవరు విలపించిననూ చూడదుగదా!